# సింహం - కుందేలు



అనగనగా ఒక అడవిలో ఒక సింహం ఉండేది. మృగరాజు ప్రతి రోజు అడవిలో ఉన్న జంతువులని చంపి తింటూ ఉండడం వల్ల, అడవిలో జంతువులన్ని సమావేశమయ్యి , ఇలా రోజు అవసరం ఉన్నా లేకపోయినా ఇన్ని జంతువులని చంపుతూ ఉంటే అడవిలో ఉన్న జంతువులన్నీ తొందరలో మాయం అవుతాయి అని మాట్లాడుకుని ఒక తీర్మానం చేస్కుని మృగరాజు దగ్గరికి వెళ్ళాయి. సింహంతో ఇలా బతిమాలుకున్నాయి - "రోజూ మీకు ఆహారం క్రింద, మాలో ఒక్కరు వచ్చి సమర్పించుకుంటాము. అడవిలో ఉన్న జంతువులు అన్నీ చంపకండి". సింహం "సరే ఇదేదో బాగుంది. కాని ఏ రోజు క్రమం తప్పుతారో ఆ రోజు మిమ్మల్ని అందరినీ చంపేస్తాను" అని చెప్పింది.

ఇక ఆ రోజు నుంచి , ప్రతి రోజు ఒక జంతువు మధ్యాహ్నం అయ్యేటప్పటికి సింహం వద్దకి ఆహారంగా వెళ్తూ ఉండేది. ఒక రోజు మన చిన్ని కుందేలు వంతు వచ్చింది. కుందేలు చిన్నది అయినా బహు బుద్ధిశాలి.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

సరే సింహం ఆహారం తినే వేళ అయ్యేటప్పటికి , కుందేలు నెమ్మదిగా ఆలోచిస్తూ సింహం దగ్గరికి బయలుదేరింది. దారిలో ఒక పెద్ద బావి కనపడింది. అప్పుడు ఆలోచనలో ఉన్న మన కుందేలు బావి గట్టు వద్దకి వెళ్ళి కిందకి చూడగా నీళ్ళలో తన ప్రతిబింబం కనపడింది. వెంటనే కుందేలుకి ఒక ఆలోచన వచ్చింది.

సరే అని నెమ్మదిగా ఆ బావి దగ్గర తన ఇష్టం వచ్చినంత సేపు ఆడుకుని పాడుకుని నెమ్మదిగా సింహం ఆహారం సమయం దాటిపోయి చాలా సేపు అవుతున్న సమయంలో సింహం దగ్గరికి వెళ్ళింది.వెళ్ళేటప్పటికి సింహం ఏమో కోపంతో పచార్లు చేస్తోంది. కుందేలుని చూడగానే గర్జిస్తూ " ఎందుకు ఇంత ఆలశ్యం అయ్యింది" అని అడిగింది.

కుందేలు భయం భయంగా " మృగరాజా నేను సమయానికే బయలుదేరాను. కాని మార్గ మధ్యంలో ఒక పెద్ద సింహం కనపడి, నన్ను చాలా సేపి ఆపి చివరికి ఇలా అంది. నేనే ఈ అడవికి రాజుని. వేరొకడు ఉండటానికి వీల్లేదు. నువ్వు ఆహారంగా వెళ్తున్న సింహంతో చెప్పు, వచ్చి నా కాళ్ళ దగ్గర పడి ఉండమని" అని చెప్పింది.

అది విన్న మన మృగరాజు కోపం కట్టలు తెంచుకుంది. కుందేలుతో "పద, ఎవడో వాడు నాకు చూపించు. వాడిని ముక్కలు ముక్కలుగా చీరేస్తాను" అని కుందేలుతో బయలుదేరింది. కుందేలు తెలివిగా సింహాన్ని బావి దగ్గరికి తీసుకుని వెళ్ళి " అదిగో మహారాజా - నేను చెప్పిన సింహం ఆ బావిలో ఉంది" అంది. సింహం బావిలోకి తొంగి చూడగానే నీడ కనపడి , అదే ఇంకో సింహం అనుకుని గట్టిగా గర్జిస్తూ బావిలోకి దూకింది. బావిలోకి దూకితే ఏమవుతుంది ? పాపం తెలివిలేని సింహం నీళ్ళలో పడి చచ్చిపోయింది . అప్పుడు అడవిలో ఉన్న జంతువులన్నీ సుఖంగా ఉండసాగాయి.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

అదీ సంగతి పిల్లలూ, మరి ఈ కథలో నీతి ఏమిటి ? అపాయాన్ని ఎప్పుడూ ఉపాయంతో తప్పించుకోవచ్చు అన్న మాట.

Keywords: Telugu Sahityam, Telugu lo chinna pillala kathalu, bala sahityam, kundelu simham katha, simham kundelu katha , kundelu upayam, neeti kathalu, telugu lo bala sahityam

www.maganti.org Vamsi M Maganti contact@maganti.org



PDF created with pdfFactory trial version www.pdffactory.com